సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



గ్యాస్ బండతో జాగ్రత్త
వేసవిలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇంట్లో వినియోగించే వంట గ్యాస్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- 8లో ▸



ఆర్టీసీ బాదుడు
- 8లో ▸

టీఎస్ ఆర్టీసీ.. వరంగల్ రీజియన్‌లో పలు రూట్లలో చార్జీలు పెంచింది. దీంతో వరంగల్, హనుమకొండ బస్టాండ్‌లో ఎక్కిన ప్రయాణికులపై అదనంగా రూ.10 భారం పడుతోంది.

గరిష్టం/కనిష్టం
37^0 /26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత, ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మున్నూరు కాపు సంఘం సభ్యులు



కాళేశ్వరం: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ భూపాలపల్లి జిల్లా మున్నూరు కాపుసంఘం అధ్యక్షుడు బండి సంజీవ్, ఆ సంఘం కాళేశ్వరం అధ్యక్షుడు కావేరి రామకృష్ణ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలో చేస్తున్న కార్యక్రమాలను సీఎంకు వివరించారు. కాళేశ్వరం దేవస్థానం కండువాకప్పి, కాళేశ్వరముక్తీశ్వరస్వామి వారి చిత్రపటాన్ని సీఎంకు అందజేశారు. కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలించొద్దు

భూపాలపల్లి రూరల్: అనుమతి లేకుండా మట్టి తరలించొద్దని నీటిపారుదల శాఖ డీఈ ప్రసాద్ అన్నారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామ శివారులోని చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం ఉదయం నాలుగు ట్రాక్టర్లతోపాటు జేసీబీని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న తరలిస్తున్న వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు చెరువు మట్టిని తరలించుకోవాలనుకుంటే అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఈ ప్రసాద్ హెచ్చరించారు.

పోలీసుల తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాఖా బంది(పోలీసులు తనిఖీ) నిర్వహించారు. బస్టాండ్ దగ్గరలో జాతీయ రాహదారిపై వచ్చే వాహనాలను తనిఖీలు నిర్వహించి, నంబర్ ప్లేట్స్ లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై ప్రసాద్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి



చిట్యాల: పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు కేటాయించిన నిధులతో మౌలిక వసతులు తాగునీరు, శానిటేషన్, తరగతి గదుల మరమ్మతు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ కుమార్, ఎంఈఓ రఘుపతి, పీఆర్ ఏఈ తిరుపతి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు



హన్మకొండ అర్బన్: క్రోధి నామ సంవత్సరం ఉగాది ఉత్సవాల సందర్భంగా పుష్ప యాగంలో భాగంగా శనివారం ఐదో రోజు పద్మాక్షి అమ్మవారిని 15 కిలోల వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు.

భవిత.. భరోసా

దివ్యాంగ విద్యార్థులకు చేయూత

- భత్యం విడుదల చేసిన ప్రభుత్వం
- 951మందికి రూ.11.98లక్షల నిధులు
- నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ



భవిత కేంద్రంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్పీ

కాటారం: దివ్యాంగ విద్యార్థులకు విద్యతోపాటు, ఇతర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు, కేంద్రాల వద్దకు రాలేని వారికి ఇంటి వద్దనే తర్ఫీదు ఇచ్చి వారిలో క్రమంగా మార్పు తీసుకురావడం కోసం గతంలో ప్రభుత్వాలు విలీన విద్యా వనరుల కేంద్రాలు(ఐఈఆర్‌సీ) ఏర్పాటు చేశాయి. వీటినే భవిత కేంద్రాలు అంటారు. ఆర్థికంగా వెనుకబడి తమ దివ్యాంగులైన చిన్నారులను శిక్షణకు తీసుకు రాలేని కుటుంబాలకు నెలనెలా రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్‌ల రూపంలో భత్యం అందజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర శిక్షా తెలంగాణ, పీఎంశ్రీ ఆధ్వర్యంలో సమకూరుస్తున్నాయి. అయితే 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల భత్యాన్ని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసి, విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

11 భవిత కేంద్రాలు..

మానసిక, శారీరక వైకల్యం కలిగిన బాల బాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యను అందించడానికి ప్రభుత్వం గతంలో ఈ భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఈకేంద్రాలు 11ఉన్నాయి. వాటిలో కాటారం, భూపాలపల్లి, చిట్యాల కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మిగిలిన 8మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని ఒక గదిల్లో భవిత కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీరికి ఐఈఆర్పీ(ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు సమ్మేళిత విద్యా విధానంతో ఈ చిన్నారులకు శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల్లా తీర్చిదిద్దుతుంటారు. భవిత కేంద్రాలకు రాలేని మానసిక వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దకే వెళ్లి నైపుణ్యాలు నేర్పిస్తుంటారు. జిల్లాలో 951 మంది దివ్యాంగులైన బాల బాలికలు భవితా కేంద్రాల్లో శిక్షణ పొందుతుండగా 19మంది ఐఈఆర్పీలు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో 76మంది ఇంటి వద్ద నేర్చుకునే విద్యార్థులకు ప్రతి శనివారం ఒక్కో ఐఈఆర్పీ తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి బోధిస్తుంటారు.

నిధుల వివరాలు..(రూ. లలో)

మండలం	విద్యార్థుల సంఖ్య	విడుదలైన నిధులు
భూపాలపల్లి	197	1,38,500
చిట్యాల	101	1,80,700
గణపురం	80	64,400
కాటారం	132	1,36,700
మహదేవపూర్	85	1,11,150
మల్హర్‌రావు	94	65,500
మొగుళ్లపల్లి	93	1,24,200
మహాముత్తారం	107	38,600
పలిమెల	61	59,100
రేగొండ	118	1,54,000
టేకుమట్ల	83	1,25,800

వివిధ కేటగిరీలు..

- భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు నెలకు రూ.500 చొప్పున చెల్లిస్తారు.
- పది నెలల రవాణా భత్యం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 1 నుంచి 12 తరగతి వరకు అభ్యసించే వారికి ఏటా రూ.5వేల చొప్పున చెల్లిస్తాయి.
- అంధత్వం, అంగవైకల్యం కలిగి పాఠశాలలకు వచ్చి చదివే వారికి నెలకు రూ.550 చొప్పున పది నెలలకు రూ.5,500 అందజేస్తారు. ఈ విద్యార్థులను కుటుంబ సభ్యులు ఎవరైనా తీసుకొని వస్తుండటంతో ఎస్కార్టు భత్యం కింద వారికి అందిస్తారు.
- పాఠశాలలు, భవితా కేంద్రాలు, ఇంటి వద్ద చదువుకునే బాలికలకు స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2వేలు అదనంగా చెల్లిస్తారు.
- అంధులు, అల్ప దృష్టి కలిగిన పిల్లలకు రీడింగ్ అలవెన్స్ పేరుతో నెలకు రూ.60చొప్పున పది నెలలకు రూ.600 చెల్లిస్తుంటారు.

విద్యార్థుల ఖాతాల్లో జమ



పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద శిక్షణ పొందుతున్న దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్‌లను అందజేస్తుంది. ప్రస్తుతం లబ్ధిదారులైన విద్యార్థుల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా డబ్బులు జమ చేస్తుంది.

- కిషన్‌రావు, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్, జయశంకర్‌భూపాలపల్లి

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కిరణ్ ఖరే



మానేరులో పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

టేకుమట్ల: పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులు, కేసుల పురోగతిని తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. చలివాగు, మానేరుల్లో పర్యటించి అక్రమ ఇసుక రవాణా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. సంఘ విద్రోహ శక్తులపై నిత్యం నిఘాపెట్టి, నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలీసులను దిక్కరిస్తే కేసులు నమోదు చేయాలని చెప్పారు. ప్రవర్తనా తీరు మార్చుకోకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ ప్రదేశాలపై నిత్యం నిఘా పెట్టాలని, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయాలని పోలీసులను ఆదేశించారు. స్థానికంగా ఇంటి నిర్మాణాలకు అధికారుల నుంచి అనుమతి తీసుకుని ఇసుకను రవాణా చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై గోగికారి ప్రసాద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆడబిడ్డగా ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- కడియం కావ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, పక్కన కావ్య

చిట్యాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మీ ఆడబిడ్డగా నన్ను ఆదరించి గెలిపిస్తే భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి చేస్తానని వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని జూకల్ గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావుతోపాటు ఎంపీ అభ్యర్థి కడియం కావ్య హాజరై, మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్రంలో బీజేపీ పదేళ్ల అధికారంలో ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. బీజేపీ సర్కార్‌లో దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని, ఎవరికి ఓటు వేసినా నష్టపోయేది ప్రజలేనని అన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే ప్రజలకు మరిన్ని కష్టాలు తప్పవన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భూపాల్లపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు అన్నారు. ఒక కార్యకర్త కనీసం యాభై ఓట్లు వేయించాలని కోరారు. కష్టపడే కార్యకర్తలకు గౌరవం ఉంటుందని తెలిపారు.

వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

భూపాలపల్లి అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేష్ కోరారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు విస్మరించిందని ఆరోపించారు. నల్లధనం తెప్పించి జీరో అకౌంట్‌లో రూ.15లక్షలు జమ చేస్తామని మరిచారని అన్నారు. ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 200రోజుల పని కల్పించి రోజు కూలి రూ.400 ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. మున్సిపల్, పట్టణ పరిధిలో కూడా ఉపాధి పనిని రూపొందిస్తామని చెప్పి మోదీ ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. బందు సాయిలు, నాయకులు రాజయ్య, రమేష్, రాజేందర్, రాజయ్య, దేవేందర్, రజనీకాంత్, శ్రీకాంత్, ప్రీతిలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభాన్ని ఎత్తుతున్న భక్తులు



వైభవంగా రామాలయం ప్రారంభం



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరంలో అంగరంగ వైభవంగా శనివారం కోదండ రామాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పూజారులు శాస్త్రోక్తంగా పూజలు, యాగాలు నిర్వహించి ఆలయంలో సీతాదేవి, శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను జరిపించారు. ఆలయ ప్రారంభోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 17న స్వామి వారి కల్యాణం జరిపించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మడతపల్లిలో దొంగల బీభత్సం

- ఒకేరోజు రెండు ఇళ్లలో చోరీ
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

రేగొండ: మండలంలోని మడతపల్లిలో వరుస చోరీలతో దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఇళ్లలో చోరీ చేసి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాముల సంతోష్ తన తల్లి ఆరోగ్యం బాగాలేక ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు బీరువాలోని రూ.30వేల నగదుతోపాటు, అర తులం బంగారం ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన కొయ్యాడ సంజీవ శనివారం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదు వేల నగదుతోపాటు, బంగారు మాటీలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. భూపాలపల్లి క్లూస్ టీమ్ సీఐ రాజ్‌కుమార్ బాధితుల ఇళ్లలో వివరాలు సేకరించారు. ఒకే రోజు గ్రామంలోని రెండు ఇళ్లలో చోరీ జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

కరకట్ట నిర్మాణం ఎప్పుడో?

- గోదావరిపై స్థల పరిశీలన చేసి రెండేళ్లు
- ఇంకా ప్రారంభంకాని పనులు
- మూలుగుతున్న రూ.137 కోట్ల నిధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఏటూరునాగారం, మంగపేట గోదావరి ఒడ్డు వెంట సర్వే చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

ఏటూరునాగారం: గోదావరి నదీతీరం వెంబడి ఉన్న లోతట్టు ప్రాంతాలను వరదల నుంచి రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిధులు మంజూరుకావడంతో పాటు స్థల సర్వే పూరై రెండేళ్ల గడుస్తున్నా అధికారులు మాత్రం పనులు చేపట్టడం లేదు. ఏటూరునాగారం మండల పరిధిలోని గోదావరి తీరం ప్రాంతం వెంబడి ఉన్న రాంనగర్ గ్రామం నుంచి మొదలుకొని మంగపేట మండలం పొదుమూరు వరకు కరకట్ట నిర్మించడానికి ప్రభుత్వం సర్వే పూర్తి చేసింది. దీంతో రాంనగర్ గ్రామం నుంచి పొదుమూరు వరకు పూర్తి స్థాయిలో కరకట్ట నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అదే విధంగా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం నుంచి మండల కేంద్రంలోని ఎక్కెల వరకు నిర్మించిన కరకట్టను బలోపేతం చేయాల్సి ఉంది. ఈ పనులకు గాను ప్రభుత్వం రూ.137కోట్ల నిధులను మంజూరు చేసింది.


8.5 కిలో మీటర్లు.. 131 ఎకరాల స్థలం

రాంనగర్ గ్రామం నుంచి పొదుమూరు వరకు కరకట్ట నిర్మించడానికి 2022లో స్థలం కోసం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. రాంనగర్ గ్రామం నుంచి కమలాపురం సరిహద్దు వరకు 6 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు గాను 106 ఎకరాల స్థలం అవసరమని అధికారులు తేల్చారు. అలాగే కమలాపురం నుంచి పొదుమూరు వరకు 2.5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించడానికి 25 ఎకరాల స్థలం అవసరం ఉందని అధికారులు సర్వేలో తేల్చారు. గోదావరి తీరం వెంట రైతుల పట్టా భూములతో పాటు లవాన్, అసైన్డ్ భూములు సైతం ఉన్నాయి. రైతుల నుంచి స్థలం సేకరించేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించి రెండేళ్ల అవుతున్నా అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడడం లేదు. రైతులు స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కూడా ముందుకు రాకపోవడంతో కరకట్ట నిర్మాణం ఆలస్యం జరుగుతోంది.

గతేడాది రూ.6కోట్ల నిధులు నీళ్లపాలు

ఏటూరునాగారం నుంచి రామన్నగూడెం వరకు ఉన్న కరకట్టను గత ఏడాది వరదలకు తట్టుకునే విధంగా బలోపేతం చేయడానికి రూ. 6కోట్ల నిధులు అదనంగా మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు, అధికారుల హడావుడి పనులు చేసి మట్టి, రాళ్లతో కరకట్టపై నామమాత్రంగా పనులు చేశారు. ఈ క్రమంలో గతేడాది వచ్చిన వరదలకు కరకట్ట కోతకు గురికావడంతో వరదలో మట్టి, రాళ్లు కొట్టుకుపోయాయి. దీంతో రూ. 6కోట్ల నిధులు నీళ్ల పాలయ్యాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు లోతట్టు ప్రాంతాల క్షేమం కోసమా.. అధికారులు, కాంట్రాక్టర్ల బాగోగుల కోసమా అని ఆయా ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ముందుకు వచ్చి కరకట్ట నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

కోటగుళ్లను సందర్శించిన జర్మనీ దేశస్తుడు



గణపురం: కాకతీయుల కళా క్షేత్రం కోటగుళ్లను శనివారం జర్మనీ దేశస్తుడు తుంబి యాస్ సందర్శించారు. జర్మనీకు చెందిన యాస్ భారత దేశంలోని పలు పుణ్య క్షేత్రాలను దర్శించే క్రమంలో భాగంగా కొచ్చి నుంచి పలు దేవాలయాలను దర్శించుకుంటూ ద్విచక్ర వాహనంపై శనివారం కోటగుళ్లకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటగుళ్ల శిల్ప సంపద మహా అద్భుతంగా ఉందని కొనియాడారు. తన వెంట తెచ్చుకున్న కెమెరాలో శిల్ప సంపదను నిక్షిప్తం చేసుకున్నాడు.

మహనీయుల స్ఫూర్తిని కొనసాగిద్దాం

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పుట్ట మధుకర్

మహదేవపూర్: మహనీయుల స్ఫూర్తిని ప్రతిఒక్కరూ కొనసాగించాలని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహాత్మ జ్యోతిభా పూలే జయంతి రోజు నుంచి అంబేడ్కర్ జయంతి వరకు 16మంది మహనీయుల దీక్ష కొనసాగించడం అభినందనీయమయన్నారు. మంథని నియోజకవర్గాన్ని 70ఏళ్లుగా ఒకే కుటుంబం పాలిస్తూ.. బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస రావు, తగరం శంకర్‌లాల్, శ్రీపతిబాపు, నాయకులు మనోహర్, లింగల రామయ్య, రాజిరెడ్డి, ఆలీంఖాన్, రమేష్, మహేశ్, లక్ష్మణ్, వంశీవర్ధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో విద్యార్థుల సందడి



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. శనివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. పూజారులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

క్లుప్తంగా

క్రీడలతో ఉపశమనం

● ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి . ప్రిన్సిపాల్

ఎంజీఎం : నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు క్రీడలతో ఉపశమనం లభిస్తుందని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలో యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ కాళోజీ వర్సిటీ అంతర్ కళాశాల పోటీలు కేఎంసీ వేదికగా రెండోసారి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ అంతర్ కళాశాల పోటీల్లో 60 మెడికల్, డెంటల్, ఆయూష్ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

● యువకుడి అరెస్ట్..రిమాండ్

కాజీపేట: ద్విచక్రవాహనంపై ఎండు గంజాయి రవాణా చేస్తున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాజీపేటకు చెందిన భాషబోయిన భరత్ ఎంకామ్ పూర్తి చేశాడు. ఉద్యోగం లేకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి కొనుగోలు చేసి కాజీపేట రైల్వే జంక్షన్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాడు. ఈ క్రమంలో పర్వతగిరి ప్రాంతం నుంచి శుద్ధి చేసిన గంజాయిని కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై కాజీపేటకు వస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై నవీన్ కుమార్ సిబ్బందితో కలిసి ఉర్సుగుట్ట ప్రాంతంలో భరత్‌ను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సై నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై లవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.



గ్యాస్ బండతో జాగ్రత్త

వేసవిలో సిలిండర్‌పై అప్రమత్తంగా ఉండాలి

● అవగాహనతోనే నష్ట నివారణ

● సొంత ప్రయోగాలు ప్రమాదకరం

ఖిలా వరంగల్ : వేసవి ఎండలు దంచికొడుతున్నాయి. ఫలితంగా రోజు రోజుకూ ఎండవేడిమి పెరుగుతోంది. దీంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రత 44 సెంటిగ్రేడ్‌గా నమోదవుతోంది. కాగా, సాధారంగా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ చోటు చేసుకుంటాయి. ఈ సమయంలో అగ్గి రాజుకుంటే ఏ వస్తువైనా బుగ్గి కావాల్సిందే. అందుకే నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఇంట్లోని వంట గ్యాస్ విషయంలో. సిలిండర్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేనిపక్షంలో అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వంట చేయడం పూర్తవ్వగానే గ్యాస్ బంద్ చేయాలి. తరుచూ సిలిండర్, స్టవ్‌ను పరిశీలించాలి. సొంత ప్రయోగాలు ప్రమాదకరం. వేసవి నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ వినియోగంలో వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



గ్యాస్ సిలిండర్లు

సిలిండర్‌తోపాటు రసీదు ముఖ్యమే..

సిలిండర్ ఇంటికి వచ్చాక రసీదులో ఉన్న ఫోన్ నంబర్లు, చిరునామా విడిగా రాసుకోవాలి. సమస్యలు వచ్చినప్పుడు ముందుగా గ్యాస్ ఏజెన్సీ వారికి ఫోన్ చేయాలి. వారు స్పందించని పక్షంలో అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. సొంత ప్రయోగాలు ప్రమాదకరం.

ప్రమాదం జరిగితే..

ప్రమాదం జరిగిన వెంటనే నగరంలోని విపత్తు నివారణ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. బాధితులకు సాయం చేయాలి. అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రిలో చేర్పించాలి. మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖ అధికారుల సాయం పొందాలి. గ్యాస్ సరఫరా చేసే వారే తక్కువ మొత్తానికి బీమా సౌకర్యం కల్పిస్తారు. వ్యక్తులతోపాటు ఇల్లు, ఆస్తులకు బీమా వర్తిస్తుంది. తద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ..



వేసవిలో వంట గదిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికావొద్దు. వెంటనే ఫైర్ అధికారుల సమాచారం ఇస్తూ వంటగదిలో వాటర్ స్ప్రే చేయాలి. మంట వ్యాప్తిని తగ్గించుకోవాలి. గ్యాస్ లీకేజీలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ అవగాహన పెంచుకోవాలి.

-బి. రవీందర్ ఇన్‌చార్జ్ ఫైర్ అధికారి, వరంగల్

జాగ్రత్తలు ఇలా..

వంటగదిలో సిలిండర్ నిలువుగా పెట్టాలి. సూర్యరశ్మి, వర్షపు నీరు సిలిండర్ మీద పడకుండా చూసుకోవాలి. సిలిండర్ పెట్టే స్థలం సౌకర్యంగా ఉండాలి. సిలిండర్, రబ్బర్, ట్యూబ్, రెగ్యులేటర్ మార్చడానికి వీలైనంత ఖాళీ స్థలం ఉంచాలి. సిలిండర్ దగ్గర పెట్రోల్, డీజిల్, గన్ని సంచులు, కాగితాలు ఉంచొద్దు. సిలిండర్‌కు సేఫ్టీ క్యాప్ ఉందా లేదా చెక్ చేసుకోవాలి. రెగ్యులేటర్ నుంచి తగినంత ప్రెజర్ వస్తుందో లేదో తెలుసుకోవాలి. రెగ్యులేటర్ కండిషన్‌లో ఉందో లేదో చూసుకోవాలి. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న పరికరాలు వాడాలి. గ్యాస్ స్టవ్ మొదలు.. రెగ్యులెటర్ , ట్యూబ్, లైటర్ వరకు అన్ని నాణ్యమైనవి వాడాలి. రబ్బర్ ట్యూబ్ పడవకుండా, పగుళ్ల రాకుండా చూసుకోవాలి. సిలిండర్ కంటే గ్యాస్ పొయ్యి ఎత్తులో ఉంచాలి. తరుచూ పొయ్యిని శుభ్రం చేసుకోవాలి. సర్వీసింగ్ చేసి తరువాత బర్నల్ సిమ్మర్ క్రమంలో ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలి. వంట గదిలో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. గ్యాస్ స్టవ్ సమీపంలో రిఫ్రిజిరేటర్ తదితర వస్తువులు ఉంచడం ప్రమాదకం. రెగ్యులేటర్ బిగించడం , సిలిండర్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ డెలివరీ బాయ్ విధిగా తమతో పాటు వేయింగ్ మిషన్ తీసుకురావాలి.

బైక్ చోరీలకు పాల్పడుతున్న మైనర్ అరెస్ట్

వరంగల్ క్రైం: ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న మైనర్ (బాలుడు)ను సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. నిందితుడి నుంచి రూ. 3 లక్షల విలువైన నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హనుమకొండకు చెందిన ఓ బాలుడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పార్క్ చేసిన నాలుగు ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లాడు. ఇందులో మట్టెవాడ పీఎస్ పరిధిలో మూడు, మామునూరు పీఎస్ పరిధిలో ఒక బైక్ చోరీకి పాల్పడ్డాడు. ఈ క్రమంలో శనివారం సీసీఎస్, మట్టెవాడ పోలీసులు పోతన జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వస్తున్న మైనర్‌ను తనిఖీ చేసి విచారించగా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అరెస్ట్ చేసి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏపీపీ తెలిపారు. కాగా, మైనర్ దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు అబ్బయ్య, గోపి, సీసీఎస్ ఎస్సై సంపత్, ఐడీ అసిస్టెంట్ సల్మాన్ పాషా, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు మున్నా, వేణుగోపాల్,రవి, కానిస్టేబుళ్లు రాములు, చంద్రశేఖర్‌ను ఏసీపీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్

21న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-07, 17 బాలబాలికల విభాగాల్లో ఈ నెల 21వ తేదీన హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధి కన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 కేటగిరీలో జనవరి01, 2008 తర్వాత జన్మించిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అండర్-07 విభాగంలో జనవరి01, 2017లోపు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు నిర్వహణ కార్యదర్శి కన్నా 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ బాదుడు..

వరంగల్ రీజియన్‌లో పలు రూట్లలో చార్జీలు పెంపు

● కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట రూట్‌లో వర్తింపు

● వరంగల్, హనుమకొండ బస్టాండ్‌లో ఎక్కిన వారికే పెరిగిన చార్జీలు

● నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణంతో పెరిగిన దూరం..

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ.. వరంగల్ రీజియన్‌లో పలు రూట్లలో చార్జీలు పెంచింది. హనుమకొండ నయీంనగర్‌లో నాలాపై నాలుగు వరుసల రోడ్డుతో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు కాకముందు వరంగల్, హనుమకొండ బస్ స్టేషన్ నుంచి బయలు దేరిన బస్సులు, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వైపు నుంచి వచ్చే బస్సులు హనుమకొండ, వరంగల్ బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు నయీంనగర్ మీదుగా ప్రయాణించేవి. బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న క్రమంలో ఈ రూట్‌లో రవాణ సౌకర్యం మూసివేశారు. దీంతో హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి హనుమకొండ చౌరస్తా, పెద్దమ్మగడ్డ, కాకతీయ యూనివర్సిటీ క్రాస్ మీదుగా బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో గతంలో కంటే నాలుగు కిలో మీటర దూరం పెరిగింది. రానుపోను కలుపుకుంటే 8 కిలో మీటర్ల దూరం పెరిగింది. నాలుగు కిలో మీటర్లు పెరిగిన క్రమంలో ఆర్టీసీ నిబంధనల మేరకు అదనంగా పెద్దమ్మగడ్డ స్టేజీని ఏర్పాటు చేయడంతో పాటు పెరిగిన కిలో మీటర్ల దూరానికి చార్జీలు పెంచారు. వరంగల్, హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బయలు దేరే ప్రయాణికులకు, ఈ బస్ స్టేషన్‌లో దిగే ప్రయాణికులకు మాత్రమే పెంచిన చార్జీలు వర్తిస్తాయి. నాలుగు కిలో మీటర్లు పెరిగినందుకు గాను కరీంనగర్, నిజామాబాద్, వేములవాడ, హుజూరాబాద్, సిద్దిపేట, అక్కన్నపేట, వేములపల్లి రూట్‌లో ప్రయాణించే ప్రతి బస్సుకు రూ.10 చొప్పున పెంచారు. ఈ చార్జీలు గుట్టుచప్పుడు కాకుండా పెంచడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ నెల 12 నుంచి అమలు చేస్తున్నా పెంచిన చార్జీలపై యాజమాన్యం కనీస ప్రచారం చేయకపోవడంతో పాటు బస్సు ఎక్కిన ప్రయాణికుల నుంచి అధికంగా రూ.10 వసూలు చేస్తుండడంతో ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని కండక్టర్, టిమ్ డ్రైవర్లను ప్రశ్నిస్తుండడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరుగుతోందని ప్రయాణికులు తెలిపారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్, కేయూ క్రాస్ మధ్య దూరం పెరగడంతో వరంగల్, హనుమకొండ బస్టాండ్‌లో ఎక్కిన, దిగిన ప్రయాణికులపై అదనంగా రూ.10 భారం పడుతోంది. మిగతా స్టేజీలలో పాత చార్జీలు వర్తిస్తాయి.

హనుమకొండ బస్ స్టేషన్ నుంచి చార్జీల వివరాలు...

స్టేజీ	పాత చార్జీలు	పెరిగిన చార్జీలు
నిజామాబాద్	రూ.300	రూ.310
మోర్తాడ్	రూ.240	రూ.250
కమ్మర్‌పల్లి	రూ.230	రూ.240
కోరుట్ల	రూ.210	రూ.220
జగిత్యాల	రూ.170	రూ.180
కరీంనగర్	రూ.110	రూ.120
హుజూరాబాద్	రూ.60	రూ.70
ఎల్కతుర్తి	రూ.40	రూ.50
వేములవాడ	రూ.150	రూ.160
సిద్దిపేట	రూ.90	రూ.100
పొలమాకుల	రూ.80	రూ.90
బస్వాపూర్, కోహెడ	రూ.70	రూ.80
సముద్రాల	రూ.60	రూ.70
ముల్కనూర్	రూ.30	రూ.40
బంగాలపల్లి	రూ.70	రూ.80
వేములపల్లి	రూ.60	రూ.70
మరిపల్లిగూడెం	రూ.50	రూ.60
కమలాపూర్	రూ.40	రూ.50
అంబాల	రూ.30	రూ.40

పాస్టరే దొంగ..

● ధ్రువీకరించిన పోలీసులు

● 48 గంటల్లో చోరీ కేసు ఛేదన

నెక్కొండ: మండలంలోని అప్పల్‌రావుపేటలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడింది పాస్టరే అని పోలీసులు ధ్రువీకరించారు. ఈ మేరకు నెక్కొండ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమోహన్.. చోరీకి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. మండలంలోని అలంకానిపేటకు చెందిన దంతాల రవి 18 సంవత్సరాల నుంచి అప్పల్‌రావుపేటలోని ఓ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన తిప్పని వీరభద్రయ్య కుటుంబం చర్చికి వెళ్తున్న క్రమంలో పరిచయం ఏర్పడి సన్నిహితంగా మారింది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన వీరభద్రయ్య కుటుంబం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న రవి.. వీరభద్రయ్య ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దీనిపై వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పాస్టర్‌ను విచారించగా చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి చోరీకి గురైన బంగారంతోపాటు రూ. 60,200 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు. కాగా, చోరీ కేసును 48 గంటల్లోనే ఛేదించిన సిబ్బందిని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు. సమావేశంలో ఎస్సై మహేందర్, హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్, కానిస్టేబుళ్లు రాకేష్, రమేష్, వెంకటేశ్వర్లు, సల్మాన్‌పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ చంద్రమోహన్, ఎస్సై మహేందర్

వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు

● విలువైన పత్రాలు, రూ. 4.57 లక్షల నగదు స్వాధీనం

● కేసు నమోదు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన వడ్డీ వ్యాపారి భూక్య సునీత ఇంట్లో శనివారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహేబ్, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సోదాలు నిర్వహించారు. సునీత ఆకులవారిఘణపురంలో నివాసముంటూ అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోంది. దీనిపై సమాచారం అందగా సెర్చ్ వారెంట్, ఇద్దరు పెద్ద మనుషులు సమక్షంలో సునీత ఇంట్లో సోదాలు చేయగా ప్రామీసరి నోట్లు, బాండ్ పేపర్లు, చెక్కులు, భూమి పత్రాలతోపాటు రూ. 4లక్షల 57 వేల 410 నగదు లభించందని ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. వాటిని సీజ్ చేశామన్నారు. సునీత.. అనుమతి లేకుండా ప్రజలకు డబ్బు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తోందన్నారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు సుధాకర్, సదానందం, గోపి, నాగలక్ష్మి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



సోదాలు చేస్తున్న ఏఎస్పీ, ఎస్సై

మరో వివాదంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

● ఆయనతోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు

జనగామ: జనగామ మండలం చీటకోడూరు శివారున రోడ్డు నిర్మాణ విషయంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై కేసు నమోదైంది. ఈ మేరకు బాధితుడు, చీటకోడూరుకు చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి కుమారుడు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం సీఐ రఘుపతిరెడ్డితో కలిసి ఏసీపీ అంకిత్ కుమార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా బాధితుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ చీటకోడూరులోని తమ సొంత పట్టా భూమి నుంచి జనగామ రెవెన్యూ పరిధిలోని (ముత్తిరెడ్డి ఆధీనంలో ఉన్న) 3 ఎకరాల భూమి వరకు బాట వేసినట్లు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో తన పట్టాభూమి నుంచి రోడ్డు నిర్మాణం చేసుకుంటామని మాజీ ఎమ్మెల్యే అడగగా, నిరాకరించినట్లు చెప్పారు. గత ఏడాది తన తండ్రి చనిపోయిన సమయంలో తాను ఇంట్లో ఉన్న విషయం గమనించి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తమ పట్టా భూమిలో రోడ్డు వేసినట్లు తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. తమ కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేయడంతో పాటు తాను విదేశాలకు వెళ్లకుండా అక్రమ కేసు పెట్టించి, పాస్‌పోర్ట్‌ను ఆపించేశారన్నారు. ఈ విషయమై సరైన ఆధారాలతో ఏసీపీ అంకిత్ కుమార్‌కు ఈ నెల10న ఫిర్యాదు చేయగా, శనివారం విచారణకు వచ్చారన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితోపాటు మరో వ్యక్తి బూరెడ్డి ప్రమోద్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



ఏసీపీకి సమస్యను వివరిస్తున్న రాజేందర్‌రెడ్డి

కక్ష గట్టి ఇలా చేస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

దీనిపై మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అక్కడ బాట ఉందని తెలిపారు. ఊరిలో రాజేందర్‌రెడ్డి తల్లి ప్రేమలతారెడ్డి దళితుల భూమిని ఆక్రమించుకుంటే, కలెక్టర్‌తో మాట్లాడి తిరిగి వారికి ఇప్పించానన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తనపై కక్ష గట్టి ఇలా చేస్తున్నారన్నారు. రాజేందర్‌రెడ్డిపై గతంలో కేసు ఉండగా, సీపీ వద్దకు ఫిర్యాదు వెళ్లడంతోనే పాస్‌పోర్ట్‌ను ఆపారే తప్ప, తన జోక్యం లేదన్నారు. పట్టా భూమిలో రోడ్డు వేయలేదన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. గజం కేవలం 15,000/- మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264880]

■ వరంగల్, పైడిపల్లి, దేశాయిపేట్ రోడ్, అరెపల్లి ORR 3KM & CKM కాలేజి సర్దార్‌పేట గవర్నమెంట్ స్కూల్ దగ్గర రిజిస్ట్రేషన్ ప్లాట్లు 200 చ॥గ॥ అమ్మబడును. 9700721870, 9494133187. [W-1264882]

■ మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి మరియు జ్యోతిబాపులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికై 9032111600. [W-1264875]

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. కిరాయి రూ॥ 10 వేలు. సంప్ర॥ 9848696291. [W-1264932]

LAND FOR SALE

■ Luxury Farm House For Sale at Moinabad, KethireddyPally, Fully Furnished, Ready to Occupy, North-East Facing & North Facing Plots at NRI Farms Venture Gated Community, Clear Tittle with Land Area 13.5 Guntas/1633 Square Yards, Agricultural Lands are also Available for Sale. Cont: 8555857167 [H-804847]

HOUSE FOR SALE

■ WGL, కొత్తవాడ లక్ష్మీగార్డెన్స్ దగ్గర 182 గ॥ల ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్ 1 BHK+2 BHK, 1st ఫ్లోర్ 2 BHK+2 BHK, 2nd ఫ్లోర్, 1 BHK పార్కింగ్ గ్రౌండ్ ఫ్లోర్ 1-కార్ & 3 బైక్స్, 1 బోర్ WMC వాటర్. సెల్ : 97046 43450/ 96529 79107. [M-11633]

SERVICES

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్‌కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్ద వారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1264881]

పేషంట్ కేర్

■ ధనవంతుల ఇళ్లలో వృద్ధులకు మరియు బెడ్‌పై ఉన్న పేషంట్స్‌కి సేవ చేయబడును. డైపరింగ్, ఇనిమి, ఫిజియోథెరపి చేయబడును. సెల్: 9063730490, 9652291023. [W-1264874]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

HEALTH CARE

■ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరము 24 గం॥ల సేవలు అందించబడును. ✆ 62814 76205, 94403 25526 [M-11630]

WANTED

■ Wanted Female Telecallers for ICICI Bank Credit Card Department Salary 10K+ Incentives. Q: 12+ Direct Job. Not a Job consultancy % KUC. Cont: 9059972955. [WA-5894]

■ నిరుద్యోగ మహిళలకు శుభవార్త! Pre Primary Teacher Training Course (PPTTC) లో Training Certificate & Job Placement. 9182111578. [W-1264883]

■ ఆర్గానిక్ స్టోర్‌లో పని చేయుటకు ఆడవారు కావలెను. చదువు అవసరం లేదు. వయస్సు 35 సం॥ నుండి 50 సం॥ వరకు. సంప్ర॥ మామునూర్ క్యాంపు. సెల్: 9959975382. [W-1264929]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph:9160900024/9640400073 [H-799868]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాదిగల కోసం యుద్ధం చేస్తా

● కడియం శ్రీహరిది నీచ రాజకీయం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: మాదిగ జాతి ఉన్నతి కోసం యుద్ధం చేస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి 40 ఏండ్లుగా విలువలు లేని రాజకీయాలు చేస్తూ మళ్లీ తనే విలువలు గల వ్యక్తినని తనకుతానే బాకా ఊదుకుంటాడని, అతడిది నీచ రాజకీయమన్నారు. కడియం శ్రీహరికి విలువలుంటే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఈటల రాజేందర్ మాదిరి ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీకి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. రాజీనామా చేయమంటే పారిపోతున్న కడియం పిచ్చికుక్క కంటే హీనమని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాలు చేసే కడియం శ్రీహరికి వరంగల్ ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. దివంతగ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు ఇస్తానన్నా తాను తీసుకోలేదన్నారు. తాను వ్యక్తిగత రాజకీయాలు చేయనని, అందరూ బాగుండాలని కోరుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేస్తోందన్నారు. మెజారిటీగా ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఉండొద్దా అని ప్రశ్నించారు. వెంకటస్వామి, మల్లు భట్టివిక్రమార్క, కడియం శ్రీహరి మూడు కుటుంబాల కోసం కాంగ్రెస్ పార్టీ మాదిగ జాతికి ద్రోహం చేసిందన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా పనిచేసేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించారన్నారు. బీజేపీ రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదన్నారు. బీజేపీ వల్లే అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ వచ్చిందని, జమ్మూ కశ్మీర్‌లో రిజర్వేషన్ల అమలు జరగనుందన్నారు. కాగా, మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకుంటే మీరే మహాజన సోషలిస్టు పార్టీ తరఫున మీ మాదిగ అభ్యర్థిని నిలబెట్టొచ్చు కదా అన్న విలేకరుల ప్రశ్నకు సమాధానమిస్తూ పీఎం మోదీ వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని నమ్ముతున్నామన్నారు. అందుకే బీజేపీకి మద్దతు ఇస్తున్నామన్నారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో అధికారులు, లాయర్లతో సహా అందరూ రెడ్డి కులస్తులేనని రాష్ట్రంలో బీసీ, ఎస్సీ అధికారులు లేరా అని ప్రశ్నించారు. 12 జనరల్‌లో సీట్లలో 6 రెడ్డి కులస్తులకు ఇస్తే 50శాతం ఉన్న బీసీలకు వద్దా అన్నారు. మాలలు, రెడ్డి కులస్తులే కాంగ్రెస్ పార్టీకి ఓటువేశారా అని ప్రశ్నించారు. రెడ్ల ఆధిపత్యాన్ని తగ్గించడానికి సీఎం రేవంత్ రెడ్డితో పోరాడతానన్నారు. దేశంలో మోదీకి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని, 3వసారి మోదీ వస్తేనే దేశ భద్రత, అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేంద్ర మాదిగ, నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, ఏక్ శంకర్ మాదిగ, కట్ల రాజశేఖర్ , గంగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బతుకుదెరువు కోసం వచ్చి.. మృత్యుఒడికి..

● క్వారీ గుంతలో పడి బాలిక మృతి

● మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : బతుకుదెరువు కోసం వచ్చిన ఓ కుటుంబంలోని బాలిక మృత్యుఒడికి చేరింది. క్వారీ గుంతలో పడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కురవి మండలం బంచరాయి తండాకు చెందిన బోడ వీరన్న, కుమారి దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడు సంవత్సరాల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చారు. పట్టణ శివారు ఆర్తి గార్డెన్స్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో వెలసిన గౌతమ బుద్ధ కాలనీలో గుడిసె వేసుకుని అక్కడే ఉంటున్నారు. కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు అనుష, నిఖిత (12), గౌతమి ఉన్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా ఈ ముగ్గురితోపాటు వీరన్న సోదరుడి కుమార్తె శ్రుతి కూడా బట్టలు ఉతకడానికి కాలనీ పక్కన ఉన్న క్వారీ వద్దకు వెళ్లారు. అక్కడ దుస్తులు ఉతుకుతూ నలుగురూ గుంతలో పడ్డారు. కొంత సమయానికి ఆ ప్రాంతం నుంచి కేకలు వినిపిస్తుండగా అటువైపు వెళ్తున్న కాలనీవాసి ఉప్పలమ్మ గమనించింది. నలుగురు నీటిలో కొట్టిమిట్టాడుతుండగా వెంటనే కుంటలో దూకి అనుష, గౌతమి, శ్రుతిని బయటకు తీసుకొచ్చింది. అయితే నిఖిత కనిపించ లేదు. దీనిపై సమాచారం అందుకున్న కాలనీవాసులు ఘటనాస్థలికి చేరుకుని నీటిలో గాలించగా బాలిక మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై బాలిక తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.



నిఖిత (ఫైల్)



బాలికలను కాపాడిన ఉప్పలమ్మ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మంపేటలో జరిగింది. ఎస్సై రవియాదవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూకల యాకయ్య (52) శనివారం ఉదయం తన ఇంటి వెనుక స్నానం చేస్తున్నాడు. పక్కన ఇంటికి సంబంధించి విద్యుత్ తీగ ఉంది. అయితే ఆ తీగకు అతుకులు ఏర్పడ్డాయి. తీగను సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవియాదవ్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉంది.



యాకయ్య (ఫైల్)

విజయవాడ-భద్రాచలంరోడ్ రైలు ప్రారంభం

డోర్నకల్: కొంతకాలం క్రితం రద్దయిన విజయవాడ-భద్రాచలంరోడ్ రైలు శనివారం ప్రారంభమైంది. విజయవాడ నుంచి ఖమ్మం, డోర్నకల్ మీదుగా కొత్తగూడెం వరకు నడిచే రైలు కొంతకాలం క్రితం రద్దయింది. అయితే మాజీ డీఆర్‌యూసీసీ సభ్యుడు మైనుపాషా అభ్యర్థన మేరకు ఈ రైలును ఈనెల 13 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నడపనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా విజయవాడ ప్రాంతం నుంచి భద్రాచలం వచ్చే ప్రయాణికుల కోసం ఈ రైలును తాత్కాలికంగా నడపనున్నారు. అయితే పూర్తిస్థాయిలో ఈ రైలు సేవలను కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.